కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- గడువులోగా సీఎంఆర్ అప్పగించాలి
- కలెక్టర్ బీ సత్యప్రసాద్
- అధికారులతో సమీక్ష

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, అక్టోబర్ 19: కొనుగోలు కేంద్రాల్లో రైతులకు పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఆయన ధాన్యం కొనుగోళ్లు, 2023-24 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ డెలివరీపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రత్యేకంగా సన్నరకం వరి ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసిన 63 కేంద్రాలకు ఏఈవోలను ట్యాగింగ్ చేయాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. సన్నరకం ధాన్యం గుర్తించడానికి డయల్ కాలీపర్ డివైస్‌ని త్వరగా తెప్పించాలని జిల్లా మార్కెటింగ్ అధికారిని ఆదేశించారు. 2023-24 సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ ఈనెల 31లోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలన్నారు. గడువులోగా సీఎంఆర్ డెలివరీ పూర్తి చేసి, వానకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి చేసుకోవడానికి సిద్ధంగా ఉండాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎస్ జితేందర్ రెడ్డి, జిల్లా మేనేజర్, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రాయికల్ : భజన మందిరం నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జగిత్యాల, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలో ముగ్గురికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా ప్రోత్సాహకం మంజూరైంది. కాగా, పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు అడువాల లక్ష్మణ్, కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, పద్మ-శేఖర్, రజియా, నాయకులు మనాల కిషన్, దుమాల రాజ్‌కుమార్, ప్రభాత్‌సింగ్ ఠాగూర్, జిలాని, దాసరి ప్రవీణ్, గుమ్ముల అంజయ్య, రాజేశం పాల్గొన్నారు.

భజన మందిరాలకు భూమి పూజ

రాయికల్, అక్టోబర్ 19: రాయికల్ మండలం సింగరావుపేట ఆంజనేయ స్వామి, రాయికల్ ఆంజనేయ స్వామి, కొత్తపేట రాజరాజేశ్వర నాగాలయం ఆవరణలో భజన మందిరాల నిర్మాణానికి శనివారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ భూమి పూజ చేశారు. పనులు త్వరగా పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హనుమాండ్లు, వైస్ చైర్మన్ గండ్ర రమాదేవి-అచ్యుత రావు, ప్యాక్స్ చైర్మన్లు రాజలింగం, ఏనుగు మల్లారెడ్డి, నాయకులు రవీందర్ రావు, కోల శ్రీనివాస్, పడిగెల రవీందర్ రెడ్డి, ముఖీద్, మర్రిపెల్లి శ్రీనివాస్ గౌడ్, జోగినిపెల్లి తిరుపతి గౌడ్, ఆకుల మల్లేశం, రాంచంద్రరావు, రాజేశం, శ్రీనివాస్, ప్రవీణ్, నరేశ్, ఇంతియాజ్, మహేందర్ బాబు, ఎంపీడీవో చిరంజీవి, ఈవో విక్రమ్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

నవంబర్‌లో జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలను నవంబర్ చివరి వారంలో నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆయా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, స్పెషల్ ఆఫీసర్లు, ప్రిన్సిపాళ్లు సన్నద్ధం చేయాలని సూచించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ సెల్ నంబర్ 94402 12333లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌కు వినతి

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: రాష్ట్రంలోని ఆలయాల్లో దేవతా విగ్రహాలను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు జగిత్యాల విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్, నగర అధ్యక్షుడు జిత్తవేణి అరుణ్, నగర ఉపాధ్యక్షుడు తవుటు రామచంద్రం, కోశాధికారి గాజోజి సంతోష్, భజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు

- ఆందోళనలో అన్నదాతలు

పెగడపల్లి కొనుగోలు కేంద్రంలో పోస్తున్న ధాన్యం

పెగడపల్లి, అక్టోబర్ 19: మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో కొనుగోలు కేంద్రాల్లో పోసిన వరి ధాన్యం తడిసే అవకాశం ఉంది. మూడు రోజులుగా వరి కోతలు ముమ్మరం కావడంతో రైతులు వరి ధాన్యాన్ని కేంద్రాలకు తరలిస్తున్నారు. పెగడపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సహకార సంఘ కొనుగోలు కేంద్రం ఇప్పటికే వరి ధాన్యంతో నిండిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మండల రైతులు కోరుతున్నారు.

నాగేందర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

బాధిత కుటుంబానికి పరామర్శ

వెల్గటూర్, అక్టోబర్ 19: ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన దేవి నాగేందర్ (దివ్యాంగుడు) మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జగన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, చిరంజీవి, తదితరులున్నారు.

అట్టహాసంగా ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జగిత్యాల టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం పోలీసులు, పాత్రికేయులకు నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ అట్టహాసంగా సాగింది. క్రికెట్ మ్యాచ్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ ప్రారంభించారు. ప్రెస్ జట్టుపై పోలీస్ జట్టు విజయం సాధించారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్, బెస్ట్ బ్యాటర్‌గా 'నమస్తే తెలంగాణ' స్టాఫ్ రిపోర్టర్ కొత్తూరి మహేశ్, బెస్ట్ బౌలర్‌గా ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, రన్నర్, విన్నర్ జట్లకు ఎస్పీ అశోక్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జగిత్యాల, మెట్‌పల్లి డీఎస్పీలు రఘుచందర్, ఉమామహేశ్వర్ రావు, ఐటీ సెల్ డీఎస్పీ రంగారెడ్డి, జగిత్యాల టౌన్, రూరల్ సీఐలు వేణుగోపాల్‌రావు, కృష్ణారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, ఆర్ఐ వేణు, ఎస్ఐలు, ఏఆర్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడు మహేశ్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ ట్రోఫీ అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్, తదితరులు

తెలంగాణ ఉద్యమకారుల పాదయాత్ర

సారంగాపూర్, అక్టోబర్ 19: కాంగ్రెస్ ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాని తెలంగాణ ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు దాసర్ల శ్రీశైలం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15న ఉద్యమకారులు ఆదిలాబాద్‌లో చేపట్టిన పాదయాత్ర శనివారం బీర్‌పూర్ మండలం మీదుగా సారంగాపూర్ నుంచి జగిత్యాలకు వెళ్లారు. ఈ సందర్భంగా బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల్లో పలువురు ఉద్యమకారులు పాదయాత్రకు స్వాగతం పలికి తమ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చింతల గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలోజీ సత్యం, పార్లమెంట్ కన్వీనర్ నక్క గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పడిగెల రవీందర్ రెడ్డి, చిన్నారెడ్డి, పెందూరి మారుతి, పాలకొండ దత్తు, లక్ష్మణ్, ఆత్రం వినోద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను కళాశాలకు పంపించండి

సారంగాపూర్, అక్టోబర్ 19: విద్యార్థులను క్రమం తప్పకుండా కళాశాలకు పంపించాలని అధ్యాపకులు ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కోరుతున్నారు. సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు బట్టపెల్లి, పోతారం గ్రామాల్లో శనివారం విద్యార్థుల ఇండ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, అధ్యాపకులు రాజు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో శనివారం జగిత్యాల రూరల్ మండల రైతులకు ఉద్యాన శాఖ, లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా లోహియా ఎడిబుల్ ఆయిల్స్ కంపెనీ సాంకేతిక సలహాదారు డాక్టర్ వై.ఎస్.రంగనాయకులు మాట్లాడుతూ, ఆయిల్‌పామ్ సాగులో మెళకువలు, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవప్రసాద్, లోహియా ఎడిబుల్ కంపెనీ సీఈవో సిద్ధాంత్, ఉద్యాన అధికారి స్వాతి, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జగిత్యాల రూరల్, అక్టోబర్ 19: జగిత్యాలలోని ఎస్‌కేఎన్ఆర్ డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్-14, 17 విభాగంలో బాలురకు పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడల్స్ అందజేశారు. జిల్లా విద్యాధికారి జగన్మోహన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్‌నాయక్, పేట అధ్యక్షుడు విశ్వప్రసాద్, కార్యదర్శి అశోక్, పీడీలు కృష్ణప్రసాద్, అంజయ్య, పుష్పలత, వెంకటలక్ష్మి, సాగర్, వేణు, భాస్కర్, గంగసాగర్, కిశోర్, ప్రశాంత్, భూమేశ్, అంజయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

సారంగాపూర్, అక్టోబర్ 19: కోనాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కోల శ్రీనివాస్, తోడేటి శేఖర్ గౌడ్, సొల్లు సురేందర్, తోడేటి జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని సందర్శించిన అసిస్టెంట్ రిజిస్ట్రార్

సారంగాపూర్, అక్టోబర్ 19: సారంగాపూర్ సహకార సంఘాన్ని శనివారం అసిస్టెంట్ రిజిస్ట్రార్, సేల్స్ అధికారి వంశీకృష్ణ సందర్శించారు. సంఘం నిర్వహణ, అభివృద్ధి, తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహకార బ్యాంక్ సూపర్‌వైజర్ రాకేశ్, సహకార సంఘం అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, కార్యదర్శి లైశెట్టి శివకుమార్, సిబ్బంది భూమేశ్, వరుణ్ పాల్గొన్నారు.

తృణ ధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శనకు జిల్లావాసి

జగిత్యాల టౌన్/జగిత్యాల రూరల్, అక్టోబర్ 19: హైదరాబాద్‌లో జరిగిన జాతీయ తృణధాన్యాల (మిల్లెట్స్) ఆహార పదార్థాల తయారీ ప్రదర్శనలో జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన ధనలక్ష్మి మహిళా సంఘం సభ్యురాలు భారతపు శ్యామల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. శ్యామలను ఐకేపీ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు అభినందించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మల్యాల, అక్టోబర్ 19: మండల కేంద్రానికి చెందిన భైరి చందన్‌కుమార్ మల్యాలలోని మల్లెగుట్ట సమీపంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు, కుటుంబసభ్యులు జగిత్యాలలోని దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్యాల, అక్టోబర్ 19: రాజారాం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త గుర్రం శంకర్ ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబ సభ్యులను చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులున్నారు.

అవగాహనతోనే వ్యాధుల నివారణ

జగిత్యాల రూరల్, అక్టోబర్ 19: వ్యాధులు వ్యాపించే తీరు పట్ల అవగాహన ఉన్నట్లయితే నివారించడం సులభం అవుతుందని ఐసీటీసీ కౌన్సిలర్ రవీందర్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు శనివారం హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాపించడానికి కారణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐటీసీ రాజు, లింక్ వర్కర్ పద్మ, ఎన్ఎస్ఎస్ అధికారి తిరుపతి రెడ్డి, అధ్యాపకులు తిరుపతి, సునీత, శ్రీలత, శిల్ప, మాధవి, స్వరూప, రాజయ్య, జగన్ పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ

ధర్మపురి, అక్టోబర్19: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి చేరుకున్న భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు జరిపించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అలాగే, లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దేవాదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ రామకృష్ణారావు ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబసమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చకులు, పండితులు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచన మండపంలో ఈవో సంకటాల శ్రీనివాస్ స్వామి వారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేసి సన్మానించారు.

పంట పొలాలకు దారి చూపాలి

గొల్లపల్లి, అక్టోబర్ 19: తమ పొలాలకు వెళ్లడానికి దారి చూపించాలని బీబీరాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు శనివారం తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్ వరందన్‌కు వినతిపత్రం అందజేశారు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ వరందన్ రైతులను సముదాయించి పంపించారు.

ప్రభుత్వ కార్యాలయాలకు మున్సిపల్ నోటీసులు

రాయికల్, అక్టోబర్ 19: పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. తహసీల్, ఎంపీడీవో, ఫారెస్ట్, వెలుగు, బీఎస్ఎన్ఎల్, విద్యుత్ సబ్ స్టేషన్, పోలీస్ స్టేషన్లకు మున్సిపల్ అధికారులు నోటీసులు ఇచ్చారు.

జాతీయ మానిటరింగ్ బృందం పర్యటన

జగిత్యాల రూరల్, అక్టోబర్ 19: మండలంలోని అంబారిపేట, ధరూర్ గ్రామాల్లో శనివారం నేషనల్ లెవెల్ మానిటరింగ్ టీం లీడర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, సభ్యుడు జయప్రకాశ్ పర్యటించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా సెర్ప్ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో వాసవి, టీఏ దయాకర్, ఏపీఎం గంగాధర్, కార్యదర్శులు రమేశ్, అజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో సాధన చేస్తేనే విజయం

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 19: విద్యార్థులు ఏకాగ్రతతో సాధన చేస్తేనే విజయం వరిస్తుందని రాజారాం ట్రస్టు చైర్మన్, సైకాలజిస్టు రాజరత్నాకర్ సూచించారు. పట్టణంలోని ఇందిర ప్రియదర్శిని కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు శనివారం ఆయన ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకునేందుకు పాటించాల్సిన చిట్కాలను వివరించారు. ఏకాగ్రతతో చదివితే జ్ఞాపకశక్తి అలవడుతుందని, అప్పుడు ఫలితాలు అద్భుతంగా ఉంటాయని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, నోట్‌బుక్స్‌తో పాటు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు కోశాధికారి లావణ్య, హెచ్ఎం పొట్ట రాజనర్సయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలను సందర్శించిన మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ రీజినల్ డైరెక్టర్

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 19: తెలంగాణ మున్సిపల్ శాఖ అడ్మినిస్ట్రేషన్ రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్ శనివారం జగిత్యాల మున్సిపాలిటీని సందర్శించారు. ఈ సందర్భంగా రీజినల్ డైరెక్టర్ షాహిద్ మసూద్‌కు మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పట్టణంలో బయో మైనింగ్, కంపోస్టు షెడ్లు, ఎనిమల్ బర్త్ కంట్రోల్ కేర్ సెంటర్‌ను పరిశీలించారు. ఆయన వెంట జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపల్ కమిషనర్లు, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మల్లాపూర్, అక్టోబర్ 19: మండలంలోని పాతదాంరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కొత్తూరి ఎర్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను శనివారం టీపీసీసీ డెలిగెట్ సభ్యుడు కల్వకుంట్ల సుజిత్‌రావు పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కొమ్ముల చిన్నారెడ్డి, నాయకులు రుత్త నారాయణ, ఇప్పపల్లి గణేశ్, తదితరులున్నారు.

రామన్నపేటలో స్కూల్ బస్సు అడ్డగింత

మల్యాల, అక్టోబర్ 19: మండలంలోని రామన్నపేట గ్రామంలో జగిత్యాలకు చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ తీరు సరిగ్గా లేకపోవడంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మద్దుట్ల గ్రామంలో చిన్నారులను ఎక్కించుకొని జగిత్యాల వైపు వెళ్తున్న క్రమంలో డ్రైవర్ వాలకం సరిగ్గా లేకపోవడంతో బస్సును రామన్నపేటలో ఆపి సదరు పాఠశాల యాజమాన్యానికి సమాచారం చేరవేశారు. దీంతో పాఠశాల యాజమాన్యం మరో బస్సును పంపించి అందులో చిన్నారులను ఎక్కించుకుని పాఠశాలకు తరలించారు.

రెడ్డి ఐక్యవేదిక జిల్లా యువజన అధ్యక్షుడిగా సతీశ్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 19: తెలంగాణ రెడ్డి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా కోనరావుపేటకు చెందిన మ్యాడపు సతీశ్‌రెడ్డి నియామకమయ్యారు. ఈమేరకు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర యువజనాధ్యక్షుడు సుమన్‌రెడ్డి శనివారం నియామకపత్రాన్ని సతీశ్‌రెడ్డికి అందజేశారు. సతీశ్‌రెడ్డికి రెడ్డి సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

టీఆర్‌నగర్ మాజీ సర్పంచ్ మృతి

జగిత్యాల, అక్టోబర్ 19: జగిత్యాలలోని తారకరామానగర్ అర్బన్ కాలనీ మాజీ సర్పంచ్ కొండ శ్రీనివాస్ (50) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. శ్రీనివాస్ పార్థివ దేహాన్ని ఏబీవీపీ నాయకులు, టీఆర్‌నగర్ వాసులు సందర్శించి, నివాళులర్పించారు.

సైబర్ నేరాలపై అవగాహన

జగిత్యాల, అక్టోబర్ 19: జిల్లా కేంద్రంలోని నవ్య బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ట్రాఫిక్ ఎస్ఐ రామచంద్రం, ఆర్ఎస్ఐ మల్లేశ్ ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీపాద నరేశ్, ప్రిన్సిపాల్ గాలిపెల్లి ఈశ్వర్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

సారంగాపూర్, అక్టోబర్ 19: రేచపల్లి శివారులోని గండి వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పెంబట్లకు చెందిన తేలు గంగారెడ్డి రూ. 10,116 అందజేశారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ మనోహర్ రెడ్డి, తదితరులున్నారు.

తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 19: పట్టణంలోని 20వ వార్డులో అక్రమ నిర్మాణం చేపడుతున్నారని తప్పుడు ఫిర్యాదు చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్వయంభూ హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు శనివారం మెట్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అలాగే, స్వయంభూ హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్‌గా చెలామణి అవుతున్న సుధాకర్ 9వ వార్డులో రోడ్డును ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని, దీనిపై విచారణ చేపట్టి నిర్మాణ పనులను నిలిపివేయాలని విన్నవించారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సమ్మతి పత్రాల స్వీకరణ

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 19: విద్యార్థులందరికీ అపార్ ఐడీ నంబర్ తీసుకోవడానికి తల్లిదండ్రుల సమ్మతి పత్రాన్ని స్వీకరిస్తున్నట్లు కోమటికొండాపూర్ ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అపార్ ఐడీ నంబర్ అంటే 2020 జాతీయ విద్యా విధానం ప్రకారం భారత దేశంలోని విద్యార్థులందరి కోసం రూపొందించిన జీవిత కాల ప్రత్యేక 12 అంకెల గుర్తింపు వ్యవస్థ అని తెలిపారు. విద్యార్థులు మైనర్లు అయినందున అపార్ ఐడీ నంబర్ కోసం తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రాలను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధారాణి, నర్మద, రాణి, జోత్స్న, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీలో ధర్మపురి వాసులకు చోటు

ధర్మపురి, అక్టోబర్ 19: మహారాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మహారాష్ట్ర తెలుగు సాహిత్య అకాడమీలో ధర్మపురి నియోజకవర్గానికి చెందిన ఇద్దరు నియమితులయ్యారు. ముంబైలో నివసించే ధర్మపురికి చెందిన మహారాష్ట్ర స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు, సీనియర్ ప్రాతికేయుడు గుండారపు శ్రీనివాస్‌తో పాటు గొల్లపల్లి మండలం శేకల్ల గ్రామానికి చెందిన తెలుగు రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ మహారాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కవి, రచయిత, పాత్రికేయుడు సంగవేని రవీంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం సాహిత్య అకాడమీ డైరెక్టర్ నవీన్ నింబాల్కర్ నియామక పత్రాలు అందజేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం

కోరుట్ల రూరల్, అక్టోబర్ 19: యూసుఫ్‌నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం ఎంఈవో గంగుల నరేశం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ, విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ గుగ్గిల్ల సురేశ్‌గౌడ్, ఉపాధ్యాయులు జనార్దన్, చందుకాంత్, శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

సోయాబీన్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 19: ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని శనివారం మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బోర్గం రాజు మార్క్‌ఫెడ్ డీఎం ఎండీ హబీబ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఎలాల వెంకట్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, సింగిల్ విండో చైర్మన్ బద్ధం గోపీ, మార్కెట్ కమిటీ కార్యదర్శి సురేందర్, సింగిల్ విండో కార్యదర్శి సతీశ్, ఏఈవో వినోద్, రైతులు భూమారెడ్డి, శ్రీనివాస్, చిన్నారెడ్డి, సత్యనారాయణ, జిల్లాల పవన్, గంగాధర్, రాజేశ్వర్‌రెడ్డి, పాన్ కంటి వెంకట్, జీవన్, లింగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కార్డు ఉన్న వారికి పని కల్పించాలి

పెగడపల్లి, అక్టోబర్ 19: ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ఎంపిక చేసి, వాటి మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సమత, ఈజీఎస్ ఏపీవో అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, టీఏ రాజేశం, ఎఫ్ఏ రవికుమార్, కారోబార్ స్వామి పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలదే

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలదేనని ఆర్డీవో, వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ మధుసూదన్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్డీవో చాంబర్‌లో శనివారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం కింద నమోదైన కేసుల్లో కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు విచారణకు హాజరు కాగా, ఆర్డీవో కౌన్సెలింగ్ ఇచ్చారు.

పాలాభిషేకం

కోరుట్ల, అక్టోబర్ 19: మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో సీతారామస్వామి ఆలయ కొండ చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణానికి రూ. 83 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నిధుల మంజూరుకు కృషి చేసిన విప్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నాయకులు జలంధర్ గౌడ్, రాజేశ్, స్వామి గౌడ్, కృష్ణ, ప్రేమ్‌సాగర్, అన్వర్ జాఫర్, నాగరాజు, రాజేశ్, రమేశ్, నారాయణ, శ్రీనాథ్ తదితరులున్నారు.

కథలాపూర్, అక్టోబర్ 19: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం రూ. 1.30 కోట్లు మంజూరు చేయడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు శనివారం విద్యార్థులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఆకుల సంతోష్, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి సత్కారం

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 19: జగ్గసాగర్ గ్రామానికి చెందిన గోపిడి రక్షిత ఎంబీబీఎస్ సీటు సాధించగా, స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం పలువురు నాయకులు సన్మానించారు. అలాగే, ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన జంగం రంజిత్‌ను కూడా శాలువాతో సత్కరించి, అభినందించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్ముల రాజ్‌పాల్‌రెడ్డి, బోగ గంగాధర్, ఇల్లెందుల శ్రీనివాస్, రాజేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భరణి నక్షత్ర పూజలు

ధర్మపురి, అక్టోబర్ 19: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనుబంధ ఆలయమైన యమధర్మరాజు ఆలయంలో శనివారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ప్రవీణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెగడపల్లి, అక్టోబర్ 19: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో హిందీ టీచర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6 నుంచి పదో తరగతి వరకు హిందీ సబ్జెక్టు బోధించుటకు హెచ్‌పీటీ అర్హతతో పాటు టెట్ ఉత్తీర్ణులైన వారు ఈ నెల 22న పాఠశాలలో నిర్వహించే డెమోకు సంబంధిత సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

బీట్‌లో దినుసుల కొనుగోలు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 19: జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో మక్కలు క్వింటాలుకు కనిష్ఠ ధర రూ. 1875, గరిష్ఠ ధర రూ. 2401 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. అలాగే, ఎంటీయూ 1010 రకం వరి ధాన్యం రూ. 1895-1905 పలికినట్లు వివరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

కావలెను
★మ్యారేజ్ బ్యూరో నందు పని చేయుటకు అమ్మాయి కావాలి. చదువుతో నిమిత్తం లేకుండా మంచి వాక్చాతుర్యం గల నమ్మకంతో పర్మినెంట్‌గా పనిచేసే అమ్మాయి కావలెను. సంప్ర|| సెల్: 8341220970
NTK-335282

WANTED
★Req. Cashier, Female Waiter, South Indian Lunch & Tandoori Master, Housekeeping for Restaurant @ AS Rao Nagar. 9393123493, 7995900498.
NT-334839-All

కావలెను
★వాటర్ ప్లాంట్‌లో పనిచేయుటకు ఆటో డ్రైవర్లు కావలెను. కిరణ్ వాటర్ ప్లాంట్ భగత్‌నగర్, కరీంనగర్. సంప్ర|| సెల్: 6262229222, 9493369988
NTK-00000

WANTED PLOTS
★హైదరాబాద్, హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కోహెడ, పసుమాముల, అబ్దుల్లాపూర్‌మెట్, బాటసింగారం, శ్రీమిత్ర, జనచైతన్య, గ్రీన్‌సిటీ, మౌంట్ ఒపేరా, సింగరేణికాలనీలో ప్లాట్లు కొనబడును. No Broakers. 9553973999 / 6303049720.
NT-336725-All

LAND FOR SALE
★MANGO FARM for Sale: 12.5 Acres, 1 Km. from Siddipet Mustabad "T" Junction Road with 2 Borewells, Total Fencing. Ph: 9849633388 / 9391515600.
NT-98790

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.